సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 19 । నవంబర్ । 2023



బ్యాలెట్ పేపర్ నుంచి..

మొదట్లో ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లు వాడేవారు. మారుతున్న కాలనుగుణంగా ప్రస్తుతం ఈవీఎంలను వినియోగిస్తున్నారు.

- 10లో ▸



చేతల్లో చూపిస్తున్నాం..

తాము మాటలు చెప్పకుండా.. పనులు చేసి చూపిస్తున్నామని బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.9 /19.3

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అయోధ్య రాముడి పాదుకలు దర్శించుకున్న భక్తులు



నిజామాబాద్ సిటీ : అయోధ్య శ్రీరాముడి పాదుకలను దర్శించుకుని భక్తులు పులకరించిపోయారు. భక్తుల దర్శనార్థం రాముడి పాదుకలతో చేపట్టిన యాత్ర శుక్రవారం రాత్రి నిజామాబాద్‌కు చేరుకుంది. శనివారం ఉదయం నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో ప్రధాన అర్చకుడు తులసీ మురళీధరాచార్యుల ఆధ్వర్యంలో శ్రీ రాముడి పాదుకలకు అభిషేకం, పూజలు చేశారు. పాదుకలను రెండేళ్లుగా దేశంలోని అన్ని ప్ర ముఖ రామాలయాల్లో తిప్పుతున్నట్లు చల్లా శ్రీనివాస్‌శాస్త్రి తెలిపారు. జనవరి 15న పా దుకలను యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు అందజేస్తామన్నారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సరళ మహేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, శోభ నవీన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోదా దామోదర్‌రావు, గడిల రాములు, శివరాజ్, రాఘవాచార్యులు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, వైశాలి పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో గోపూజ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : గోపాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలోని గోల్‌హనుమాన్ మందిరంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ అర్బన్ ప్రభారీ, జిల్లా సహ కార్యదర్శి ధాత్రిక రమేష్ మాట్లాడుతూ గోపాష్టమి విశిష్టత తెలిపారు. శ్రీకృష్ణభగవానుడు మొదటిసారి గోవులను తోలుకెళ్లిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. వీహెచ్‌పీ ఆవిర్భవించి 60 ఏళ్లు అయిన సందర్భంగా మూడు రోజుల పాటు పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి అరుణ్‌రెడ్డి, జిల్లా కోశాధికారి నాంపల్లి శేఖర్, బజరంగ్‌దళ్ నగర అధ్యక్షుడు యెండల సాయిబాబు, గోల్ హనుమాన్ మందిర్ చైర్మన్ నీలగిరి రాజు, బంజరమేష్, శ్రీహరి, నరేష్‌గౌడ్, శ్యాం పాల్గొన్నారు.

భారత్ గెలవాలని హోమం




నిజామాబాద్ సిటీ : వన్ డే ప్రపంచకప్ ఫైనల్‌లో భారత జట్టు గెలవాలని క్రికెట్ అభిమానులు పూజలు, హోమాలు చేస్తున్నారు. శనివారం నగరంలోని మారుతినగర్‌లో బ్రహ్మశ్రీ జోషి మధుసూదనశర్మ రుగ్వేద ఘనాపాటి ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి చండీ హోమం నిర్వహించారు. జోషి శివతేజ శర్మ, శశికాంత్, గురుస్వామి మనోహర్ స్వామి, ప్రసాద్ స్వామి పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు నోటీసులు

ఖలీల్‌వాడి : జిల్లాలోని 228 ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు డీఎస్‌ఈ, ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో అటెండెన్స్ నమోదు చేయలేదు. దీంతో డీఈవో దుర్గాప్రసాద్ శనివారం నోటీసులు జారీ చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్స్, ప్రిన్సిపాల్స్ ఈ నెల 21 వరకు డీఈవో కార్యాలయంలో వివరణ ఇవ్వాలన్నారు. లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిజాంషుగర్స్ ఆస్తులు కబళించేందుకు మరో కుట్ర



బోధన్ : నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ ప్రైవేట్ యాజమాన్యం అధీనంలో ఉన్న రూ. వేల కోట్ల ఆస్తులను కబళించేందుకు కుట్ర జరుగుతోందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. ఫ్యాక్టరీకి ఉన్న బ్యాంక్ అప్పులు తీర్చేందుకు భూముల విక్రయానికి అనుమతి ఇవ్వాలని ప్రైవేట్ యాజమాన్యం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిందని తెలిపారు. భూముల అమ్మకాల ద్వారా రూ. 2,500 కోట్ల సేకరణకు యాజమాన్యం ప్రయత్నిస్తోందంటున్నారు. శనివారం షుగర్ ఫ్యాక్టరీ గేటు ఎదుట కార్మిక నాయకులు రవిశంకర్‌గౌడ్, ఉపేందర్, బాలక్రిష్ణ, భాస్కర్ మాట్లాడారు.

ప్రచార జోరు

- ఎన్నికలు సమీపిస్తుండటంతో స్పీడ్ పెంచిన అభ్యర్థులు
- స్టార్ క్యాంపెయినర్లతో ప్రధాన పార్టీల హడావుడి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎన్నికలు సమీపిస్తుండటంతో అభ్యర్థులు ప్రచారంలో వేగం పెంచారు. పోలింగ్ ఈ నెల 30న ఉండడంతో 28 సాయంత్రానికి ప్రచారం పూర్తి చేయాల్సి ఉంది. సమయం లేకపోవడంతో ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకునే లక్ష్యంతో అభ్యర్థులు స్పీడ్ పెంచారు. బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు అగ్ర నేతలను, ముఖ్య నాయకులను ప్రచారానికి తీసుకొచ్చుకునేందుకు ప్రణాళికలు తయారు చేసుకుంటున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన స్టార్ క్యాంపెయినర్లు జిల్లాకు వస్తే చాలు వరుసగా మూడు నుంచి నాలుగు నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఉమ్మడి జిల్లాలో విడతల వారీగా పర్యటించి రెండు నుంచి మూడు నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో పాల్గొన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్, కవిత సైతం వివిధ నియోజకవర్గాల్లో ప్రచారానికి వస్తున్నారు.

అగ్రనేతల ప్రచారం

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో కార్నర్ సమావేశాల్లో పాల్గొన్నారు. మరో విడత ఆయన ప్రచారానికి రానున్నారు. కొందరు తమ నియోజకవర్గాలకు ప్రియాంకగాంధీని రప్పించేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సైతం తీసుకొచ్చి ప్రచారం చేయించేలా రంగం సిద్ధం చేసుకుంటున్నారు. బీజేపీ అభ్యర్థులు సైతం జాతీయ స్థాయి నాయకులను, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రచారానికి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మరోవైపు కాంగ్రెస్, బీజేపీలు మేనిఫెస్టో విడుదల చేశాయి. మేనిఫెస్టోల్లోని అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో అగ్ర నేతల ప్రచారానికి అభ్యర్థులు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీలు సైతం మరిన్ని హామీలు గుప్పిస్తుండడం విశేషం. స్థానిక అంశాలను సైతం ప్రస్తావిస్తూ ప్రచారంలో అభ్యర్థులు హామీలు ఇస్తున్నారు. నిజామాబాద్ జిల్లా వ్యవసాయ ప్రాంతం కావడంతో రైతు సమస్యలను ప్రతిపక్ష పార్టీలు ప్రస్తావిస్తుండగా, బీఆర్‌ఎస్ మాత్రం రైతులకు చాలా మేలు చేశామని చెబుతోంది.



స్వామివారి పల్లకీ సేవలో భక్తులు

నింబాచల బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భీమ్‌గల్ మండలం లింబాద్రి గుట్ట లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదట భీమ్‌గల్‌లోని గ్రామాలయంలో ఉత్సవమూర్తులకు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుష్పాలంకృతుడైన స్వామివారు మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో కొండపైకి చేరుకున్నారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. – భీమ్‌గల్

- మరిన్ని ఫొటోలు 10లో..

కష్టాలు తీరే రోజొచ్చింది

- కేసీఆర్ ఫ్యామిలీని పొలిమేరలు దాటిచ్చుడే
- గజ్వేల్‌ను ఆగంజేసి కామారెడ్డి మీద కన్నేసిండ్రు
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



రాజంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన షబ్బీర్‌అలీ

సాక్షి, కామారెడ్డి/భిక్కనూరు/రాజంపేట : 'తెలంగాణలో అధికారం కాంగ్రెస్ పార్టీదే. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల కష్టాలు తీరే రోజొచ్చింది. గజ్వేల్‌ను ఆగంజేసి, కామారెడ్డి మీద కన్నేసిన కేసీఆర్ ఫ్యామిలీని ఓడించి పొలిమెరలు దాటించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు' అని పీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి రాజంపేట, భిక్కనూరు మండల కేంద్రాల్లో నిర్వహించిన రోడ్‌షోలలో ప్రసంగించారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సిన రోడ్‌షోలు రాత్రి 7 గంటలకు మొదలయ్యాయి. మొదట రాజంపేటలో నిర్వహించారు. అక్కడి నుంచి భిక్కనూరులో నిర్వహించారు. గజ్వేల్ ప్రజలను ఆగం జేసి, ఇప్పుడు కామారెడ్డికి వస్తున్నారని, వారి కుట్రలను గమనించి తగిన గుణపాఠం చెప్పాలని రేవంత్‌రెడ్డి కోరారు. డిసెంబర్ 9న రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రతిపాదించిన ప్రతీ హామీని తప్పకుండా అమలు చేసి తీరుతామని ప్రకటించారు. రైతులకు 24 గంటల పాటు ఉచితంగా నాణ్యమైన కరెంటు ఇస్తామని, ఇదే సమయంలో పేదల ఇళ్లకూ ఉచిత కరెంటు ఇస్తామని ప్రకటించారు. రైతుల రూ. 2 లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తామన్నారు. బీడీ కార్మికులందరికీ రూ. 4 వేల పింఛన్ ఇస్తామని తెలిపారు. ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల బతుకుల్లో వెలుగులు నింపుతామన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15 వేలు, కౌలు రైతులకు కూడా రూ.15 వేలు అందిస్తామన్నారు.

మూడోసారీ అధికారం మనదే..

- ఒక్క ఓటు ఇవ్వండి.. ముగ్గురం కూలీ పనిజేస్తం
- కేసీఆర్ రాకతో కామారెడ్డి నంబర్‌వన్ అవుతుంది
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బీబీపేట రోడ్‌షోలో అభివాదం చేస్తున్న కేటీఆర్

సాక్షి, కామారెడ్డి/భిక్కనూరు/బీబీపేట : 'మూడోసారి అధికారం మనదే. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుడు పక్కా. మీరు ఒక్క ఓటు వేయండ్రి. కేసీఆర్‌తో పాటు నేను (కేటీఆర్), గంప గోవర్ధన్ ముగ్గురం కూలీలలెక్క పనిజేసి మీ కష్టాలు తీరుస్తం. కేసీఆర్ రాకతో కామారెడ్డి నంబర్ వన్ అయి తీరుతుంది' అని రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి, కాచాపూర్, బీబీపేట మండల కేంద్రంలో రోడ్‌షోలలో కేటీఆర్ ప్రసంగించారు. సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కేటీఆర్ కోరారు. మనల్ని గోసపెట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మాయమాటలతో మన ముందుకు వస్తున్నారని, వాళ్ల మాటలు విని పొరపాటున అధికారం అప్పగిస్తే రాష్ట్రం ఆగమైతదన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కరెంటు కష్టాలు తీరాయని, వడ్లు కొంటున్నామని, అన్ని సౌలత్‌లు జేసినమని చెప్పారు. గోదావరి జలాలు కూడా వస్తాయన్నారు.

హ్యాట్రిక్ పక్కా..

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం పక్కా. సీఎం కేసీఆర్ మూడోసారి సీఎం అయి హ్యాట్రిక్ కొట్టుడు డబుల్ పక్కా అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎద్దు ఎవుసం తెలువనోళ్లు వచ్చి చెప్పే మాటలు వింటే చెడిపోతరని, అందులకే రైతులకు బంధువు అయిన కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. వడ్డించేది మనోడైతే బంతిల ఏ మూలకు కూసున్నా పూలుగుబొక్క వస్తదని, అట్లనే సీఎం కామారెడ్డి ఎమ్మెల్యే అయితే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి రాష్ట్రంలో నంబర్‌వన్ స్థానంలో నిలుస్తుందని కేటీఆర్ అన్నారు.

ఏరుదాటాక

తెప్ప తగలేస్తారు





- కాంగ్రెస్‌కు ఓటేస్తే కర్ణాటక లెక్క ఆగమైతం
- బీజేపీ ఈసారీ డకౌట్
- నీళ్ల మంత్రిగా పనిచేసిన మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి తాగు, సాగు నీరివ్వలేదు
- సర్వేలన్నీ జీవన్‌రెడ్డి విజయాన్ని సూచిస్తున్నాయి
- బిగాల కష్టాల్లో మీతోనే ఉన్నారు..
- జిల్లాలో రోడ్డు షోలో మంత్రి హరీశ్‌రావు

రెంజల్ (బోధన్)/నందిపేట్ /మాక్లూర్(ఆర్మూర్)/ ఖలీల్‌వాడి: ఆరు హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ కుయుక్తులు పన్నుతోందని, ఏరు దాటాక తెప్ప తగలేస్తుందని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హరీశ్‌రావు శనివారం బోధన్ నియోజకవర్గంలోని సాటాపూర్, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గంలోని మాక్లూర్ మండలం మాణిక్‌భండార్, నందిపేటల్లో నిర్వహించిన సభల్లో మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల్లో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ఆరుగ్యారంటీలు ప్రచారం చేశారని, తీరా గెలిచాక పథకాలను మరిచారన్నారు. అక్కడి ప్రజలు ఓటు వేసినందుకు లబోదిబో మంటున్నారన్నారు. ఈసారీ బీజేపీ డకౌట్ అవుతుందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నంత కాలం తెలంగాణ రాష్ట్రం, బీఆర్‌ఎస్ పార్టీ సెక్యులర్ గానే ఉంటుందన్నారు. నీళ్ల మంత్రిగా పనిచేసిన మాజీ మంత్రి, బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలు, రైతులకు కనీసం తాగు నీరు, సాగు నీరు అందించలేదని విమర్శించారు. మాజీ మంత్రి చేయలేని పనులను గులాబీ జండా చేసిందన్నారు.

నిజామాబాద్ నగరంలో గతానికి ఇప్పటికి ఎంత మార్పు వచ్చిందో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి నిధులు తెచ్చి కార్పొరేట్ ఆస్పత్రిగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. గణేష్ గుప్తను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

బోధన్ సమావేశంలో ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

గెలుపు ఖాయం

ప్రత్యర్థులు చేసుకుంటున్న సర్వేలన్నీ ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి విజయాన్ని చూపిస్తున్నాయని మంత్రి తన్నీరు హరీశ్ రావు పేర్కొన్నారు. ఆర్మూర్‌లో జీవన్‌రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జీవన్ రెడ్డి మాట్లాడుతూ తనను మూడోసారి గెలిపిస్తే మీలో ఒకడిగా ఉండి ఆదుకుంటానని ప్రజల నుద్దేశించి అన్నారు. నిజామాబాద్ అర్బన్ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు మీతో ఎమ్మెల్యే బిగాల గణేశ్ ఉన్నాడని హరీశ్‌రావు అన్నారు. కరోనా సమయంలో గల్లిగల్లీ తిరిగి నగర ప్రజలకు ధైర్యం చెప్పి ఆదుకున్నారని అన్నారు.

బంతి.. బంతికి బెట్టింగ్



ఖలీల్‌వాడి : వరల్డ్ కప్ మ్యాచ్‌లతో క్రికెట్ అభిమానులు పండుగ చేసుకుంటున్నారు. ఆదివారం జరగనున్న ఫైనల్ మ్యాచ్ కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఆస్ట్రేలియా, భారత్ మధ్య ఫైనల్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు బెట్టింగ్ జోరుగా సాగనుంది. ఆదివారం కావడంతో క్రికెట్ అభిమానులకు కలిసి వచ్చింది. పల్లె నుంచి నగరం వరకు బెట్టింగ్ దందా జోరుగా సాగుతోంది. ఏజెంట్లు ఇప్పటికే బెట్టింగ్ రాయుళ్లకు సమాచారం అందించారు. స్మార్ట్ ఫోన్‌ల ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. కొందరు అప్పు తెచ్చి, బంగారం కుదువ పెట్టి మరి బెట్టింగ్ వేస్తున్నారు. బెట్టింగ్‌లను నివారించడానికి పోలీసులు అవగాహన కార్యక్రమాలు, ప్రచారం నిర్వహించినా గుట్టు చప్పుడు కాకుండా సాగుతోంది. ప్రతి బంతిపై బెట్ పెడుతున్నారు. ఈ బాల్‌కు వికెట్ పడుతుందా.. ఎన్ని పరుగులు వస్తాయి.. ఓవర్‌లో ఎన్ని పరుగులు వస్తాయి.. ఇలా ప్రతి అంశంపై బెట్టింగ్ పెడుతున్నారు. స్మార్ట్ ఫోన్‌తోపాటు ఎప్పటికప్పుడు ఏజెంట్ల ద్వారా ఫలానా దానిపై అంటూ ఆన్‌లైన్ పేమెంట్ చేస్తూ బెట్టింగ్ కాస్తున్నారు. పోలీసులకు అనుమానాలు రాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిసింది. యాప్‌లలో బెట్టింగ్ పెడుతూ, ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు.

ఎంఐఎం, బీఆర్‌ఎస్ ఒక్కటే..

అవినీతికి మారుపేరు కాంగ్రెస్

- 'అర్బన్' ప్రజలు శాంతియుత వాతావరణం కోరుకుంటున్నారు
- కాషాయ జెండా.. ఇందూరు ప్రజలకు అండ
- బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ

ఎంఐఎం, బీఆర్‌ఎస్ ఒక్కటేనని, కాంగ్రెస్ అంటే అవినీతికి మారుపేరని నిజామాబాద్ అర్బన్ బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. దేవాలయాలకు కాషాయ జెండా మాత్రమే అండగా ఉంటుందని నగర ప్రజలు నమ్ముతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఒక వర్గం ఓట్లనే నమ్ముకున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. ఈ సారి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా ధన్‌పాల్ సూర్యనారాయణతో 'సాక్షి' ఇంటర్వ్యూ..

– సుభాష్‌నగర్



■ ఎన్నికల ప్రచారం ఎలా కొనసాగుతోంది?

➡ ప్రచారంలో మేమే మొదటి స్థానంలో ఉన్నాం. ఇప్పటికే ఆత్మీయ సమావేశాలు నిర్వహించాం. సగానికిపైగా డివిజన్లలో కేంద్ర పథకాలు, బీజేపీ పాలన గురించి వివరించి, మద్దతివ్వాలని కోరాం. ఇంటింటికి వెళ్లి కమలం గుర్తుకు ఓటేయాలని కోరుతున్నాం. ఏ డివిజన్, కాలనీకి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

■ ఎలాంటి సమస్యలు ముందుకు తీసుకొస్తున్నారు?

➡ నగరంలో అనేక రకాల సమస్యలను ప్రజలు మాకు చెబుతున్నారు. ముఖ్యంగా ఇళ్లు, రేషన్‌కార్డులు, ఉపాధితోపాటు డ్రెయినేజీలు, తాగునీరు, రోడ్లు, తదితర సమస్యలు తెచ్చారు. అదేవిధంగా లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ముంపు సమస్యలు తీసుకొచ్చారు. ముఖ్యంగా బీఆర్‌ఎస్ పాలనలో అరాచకాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు ఇలా ఎక్కువయ్యాయని చెప్తున్నారు. బీజేపీ గెలిస్తే వాటికి చెక్ పెడతామని ప్రజలకు వివరిస్తున్నాం.

■ ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

➡ ఇందూరు నగర ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. ఎక్కడికెళ్లినా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్వాగతం పలుకుతున్నారు. ప్రజల నుంచి బీజేపీకి అనూహ్యమైన, ఊహించని రీతిలో స్పందన వస్తోంది. అర్బన్‌లో బీజేపీ గెలుపు ఖాయమైంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు కేవలం ఒక వర్గం ఓట్లను నమ్ముకుని పని చేస్తున్నారు. అందుకే మరో వర్గం పూర్తిగా బీజేపీకే మద్దతు పలుకుతోంది. అలాగే ట్రస్ట్ ద్వారా చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, వినాయక చవితి, దుర్గామాతా మండపాలకు అందించిన సహకారాన్ని ప్రజలే గుర్తుచేయడం సంతోషంగా ఉంది.

■ బీఆర్‌ఎస్‌కు ఎంఐఎం మద్దతుపై ఏమంటారు?

➡ బీఆర్‌ఎస్ పార్టీ పేరు చెప్తేనే ప్రజలు ఈసడించుకుంటున్నారు. బీఆర్‌ఎస్‌కు ఎంఐఎం పూర్తి మద్దతు పలికింది. అందుకే ఎంఐఎం తన అభ్యర్థిని పోటీలో నిలపలేదు. బీఆర్‌ఎస్ గెలిస్తే ఎంఐఎం గెలిచినట్లే. అలా అయితే నగరంలో దౌర్జన్యాలు పెరుగుతాయి. అంతేగాక పదేళ్లలో ఒక్క ఇల్లు ఇవ్వలేదు. రేషన్‌కార్డులు పంపిణీ చేయలేదు. అభివృద్ధి పేరుతో వందల కోట్లు దోచుకున్నారు. షాడో ఎమ్మెల్యే ఆగడాలు మితిమీరిపోయాయి.

■ షబ్బీర్ అలీ పోటీపై మీ అభిప్రాయం?

➡ కామారెడ్డిలో చెల్లని రూపాయి షబ్బీర్ అలీ. ఆయన ఇక్కడికి ఏ ఓట్లను నమ్ముకుని వచ్చారో అందరికీ తెలుసు. షబ్బీర్ గత చరిత్ర జిల్లా ప్రజలకు తెలియంది కాదు. ఆయన నాన్ లోకల్. ఈ నెల 28న తట్టా.. బుట్టా సర్దుకుని మళ్లీ కామారెడ్డి, హైదరాబాద్‌కు వెళ్లిపోతారు.

■ ప్రచారంలో ఎలాంటి ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు?

➡ నగరంలో బీజేపీ ప్రచారంలో ముందంజలో ఉంది. బీజేపీకి వస్తున్న మద్దతు చూసి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు నిద్ర పట్టడం లేదు. సీనియర్లు, జాతీయ, రాష్ట్ర నాయకత్వం సూచనలు, సలహాలు, పాత, కొత్త కేడర్ సమన్వయంతో ప్రచారంలో ముందుకెళ్తున్నాం.

గెలిస్తే ప్రజలకు ఏం చేస్తారు?

➡ గెలిచిన తర్వాత నగరాన్ని కేంద్ర ప్రభుత్వ నిధులతో స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాను.
- 6 నెలలకొకసారి ఉద్యోగమేళా నిర్వహిస్తాం.
- ఇల్లులేని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా సొంతింటి కల సాకారం చేస్తాం.
- ఖిల్లా రామాలయాన్ని మినీ అయోధ్యగా తీర్చిదిద్దుతా.
- పురాతన, శిథిల, చారిత్రక దేవాలయాల పునరుద్ధరణ, ఆలయ భూములను పరిరక్షిస్తాం.
- అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం.
- నగరవాసుల ఆహ్లాదం కోసం మ్యూజికల్ పార్క్ ఏర్పాటు చేయిస్తాం.
- వరద లోతట్టు ప్రాంత ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం.
- కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ పునరుద్ధరిస్తాం.
- నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం.
- అర్హులైన వారికి రేషన్ కార్డులు పంపిణీ చేస్తాం. పింఛన్ ఇప్పిస్తాం.
- ఉచిత విద్య, వైద్యం అందిస్తాం.
- బీజేపీ మేనిఫెస్టోను అమల్జేస్తా.

■ చివరగా ప్రజలకు ఏం చెబుతారు?

➡ ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా ఆశీస్సులతో అర్బన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా బీజేపీకి ఓటు వేసి గెలిపించండి. నీతి, నిజాయితీతో నిస్వార్థంగా చేసే సేవ అంటే ఏంటో చూపిస్తా. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి రూపాయి, పథకాన్ని లబ్ధిదారుడికి చేరవేసి సేవకుడిగా ఉంటా. ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నగరాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాను.

క్లుప్తంగా

భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరం



నిజామాబాద్‌నాగారం: భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరమని జిల్లా ఆరోగ్య విద్యా బోధకుడు ఘనపూర్‌ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు నగరంలోని కంఠేశ్వర్‌లో ఉన్న మహిళా కళాశాలలో గర్భస్థపూర్వ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పుట్టబోయే శిశువు ఆడైనా మగైనా అందరూ సమానమే అని అన్నారు. ఆర్‌ఎంపీలు, వైద్యులు స్కానింగ్‌ సెంటర్లతో కుమ్మక్కై భ్రూణ హత్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ భారతి, చంద్రకళ, స్వామి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓటర్లకు పోల్‌ స్లిప్‌ల పంపిణీ



మోర్తాడ్‌: ప్రతి ఓటరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనేలా, వంద శాతం పోలింగ్‌ లక్ష్యంగా ఎన్నికల సిబ్బంది కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో సాధారణ ఎన్నికల పోలింగ్‌కు ఇంకా సమయం ఉన్నా ప్రతి ఓటరుకు పోలింగ్‌ స్లిప్‌ను స్వయంగా అందిస్తున్నారు. ఓటరు పేరుతో ఉన్న పోలింగ్‌ స్లిప్‌లో పోలింగ్‌ బూత్‌ సంఖ్యతో పాటు దాని చిరునామా, ఇతర వివరాలు నమోదు చేసి ఎన్నికల కమిషన్‌ అందిస్తోంది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలతో పాటు బాన్సువాడ నియోజకవర్గంలోని పలు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 13,94,986 మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తూ స్లిప్‌లను సిబ్బంది అందిస్తున్నారు. బూత్‌లెవల్‌ అధికారులతో స్లిప్‌లను పంపిణీ చేస్తుండగా సెక్టార్‌ అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

మంత్రికి పేపర్‌ ఏజెంట్ల వినతి



ఖలీల్‌వాడి: పేపర్‌ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రి హరీశ్‌రావుకి అర్బన్‌ న్యూస్‌ పేపర్‌ ఏజెంట్స్‌ హాకర్స్‌, బాయ్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల సత్యం, అర్బన్‌ అధ్యక్షుడు రణం రవీందర్‌గౌడ్‌ వినతి పత్రం అందించారు. వారి వెంట మామిడాల శ్రీకాంత్‌, దూస రవికుమార్‌, కావేటి శ్రీనివాస్‌, కస్తూరి శంకర్‌ ఉన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఎల్లమ్మగుట్టలో ఉన్న ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి నిర్వాహకులను అరెస్టు చేసినట్లు ఎస్సై సంజీవ్‌ శనివారం తెలిపారు. దాడిలో ఇద్దరు నిర్వాహకులు, ముగ్గురు మహిళలు, ఒక విటుడిని పట్టుకొని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

బ్యాలెట్‌ పేపర్‌ నుంచి..

- 2006లో ఎం–2 ఈవీఎంలు వాడకం
- దొంగ ఓట్ల నియంత్రణకు టీఎన్‌ శేషణ్‌ సంస్కరణలు



ఆర్మూర్‌: దొంగ ఓట్లను నియంత్రించడానికి నాటి కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్‌ టీఎన్‌ శేషణ్‌ విశేషంగా కృషి చేశారు. ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణల్లో బ్యాలెట్‌ పేపర్‌కు బదులు ఈవీఎంల వినియోగం ప్రధానమైనది. ఎన్నికల సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, పార్టీ గుర్తులతో ముద్రించిన బ్యాలెట్‌ పేపర్‌ను మొదట్లో ఉపయోగించే వారు. ఓటరు తాను ఓటు వేయాలనుకునే అభ్యర్థి పార్టీ గుర్తుపై స్టాంప్‌ వేసి బ్యాలెట్‌ పేపర్‌ను బాక్సులో వేసే వారు. అనంతరం ఎన్నికల అధికారులు బ్యాలెట్‌ పేపర్లను లెక్కించి విజేతలను ప్రకటించేవారు. దీంతో ఓట్ల లెక్కింపు కష్టంగా మారేది. ఈ సమస్యను అధిగమించేందుకు టీఎన్‌ శేషణ్‌ హయాంలో ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ మిషన్‌ (ఈవీఎ)తో ఓటు వేసే పద్ధతిని ప్రవేశపెట్టారు. మొదట్లో ఎం–1 టైప్‌ ఈవీఎంలు రాగా, 2006 తర్వాత ఎం–2 ఈవీఎంలు వచ్చాయి. 2013 తర్వాత ఎం–3 ఈవీఎంలు వాడకంలోకి వచ్చాయి. ఇప్పుడు ఓటరు తాను వేసిన గుర్తుకే ఓటు పడిందా లేదా అన్నది తెలుసుకోడానికి ఓటర్‌ వెరిఫికేబుల్‌ ప్యాట్‌ను ప్రవేశపెట్టారు.

16 మందికి మించితే బ్యాలెట్‌..

ఈవీఎంలను ఉపయోగించే మొదటి రోజుల్లో 16 మంది అభ్యర్థులకు మించితే బ్యాలెట్‌ పేపర్‌ను వాడేవారు. నూతనంగా ఈవీఎంలు ప్రవేశపెట్టినప్పుడు ఎం–1 టైప్‌ ఈవీఎంలు కావడంతో ఓ కంట్రోల్‌ యూనిట్‌ ద్వారా ఒక బ్యాలెట్‌ యూనిట్‌కే కనెక్షన్‌ ఇవ్వగలిగేవారు. ఒక ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల పేర్లు, గుర్తులే వచ్చేవి. అంతకన్నా ఎక్కువ అభ్యర్థులు బరిలో ఉంటే బ్యాలెట్‌ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించేవారు. 2006 తర్వాత ఎం–2 టైప్‌ ఈవీఎంలు వచ్చాయి. వీటికి ఒక కంట్రోల్‌ యూనిట్‌కు నాలుగు ఈవీఎంలు కనెక్షన్‌ ఇవ్వవచ్చు. దీంతో ఒక నియోజకవర్గంలో 64 మంది పోటీ చేసినా ఈవీఎంల ద్వారా ఓటింగ్‌ నిర్వహణకు వెసులుబాటు కలిగింది. 2013 తర్వాత ఎం–3 ఈవీఎంలు అందుబాటులోకి రావడంతో ఒక కంట్రోల్‌ యూనిట్‌కు 24 బ్యాలెట్‌ యూనిట్ల కనెక్షన్లు ఇవ్వొచ్చు. దీంతో 384 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నా ఈవీఎంలతోనే ఓటింగ్‌ సాధ్యమవడానికి అవకాశం కలిగింది. ఈవీఎంల సామర్థ్యం, పనితీరును ఎంత మెరుగుపరిచినా తాను వేసిన గుర్తుకు ఓటు పడిందో లేదోనన్న అనుమానం ఇటు ఓటర్లలో అటు రాజకీయ పార్టీల నాయకుల్లోనూ ఉండేది. ఈవీఎంలను ట్యాంపరింగ్‌ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తేవి. అలాంటి ఆరోపణలు, అనుమానాలకు ఆస్కారం లేకుండా నూతనంగా వీవీ ప్యాట్‌లను ప్రవేశపెట్టారు. దీంతో ఓటరు తాను వేసిన గుర్తుకు ఓటు పడిందా లేదా అన్నది వీవీ ప్యాట్‌లో చూసి నిర్ధారించుకొనే అవకాశం కలిగింది. ఓటరు ఓటు వేసిన వెంటనే వీవీ ప్యాట్‌లో ఏడు సెకండ్ల పాటు అతను ఓటు వేసిన పార్టీ గుర్తు కనిపిస్తుంది.

నింబాచల బ్రహ్మోత్సవాలు ప్రారంభం





భీమ్‌గల్‌లోని నింబాచలంపై శ్రీమన్నింబాద్రి లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. భక్తులు మేళతాళాలు, బోనాలతో గుట్టకు చేరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. - భీమ్‌గల్‌

చాంబర్‌ సభ్యుల కృషితో ఏదైనా సాధ్యం

జిల్లా జడ్జి సునీత కుంచాల



మాట్లాడుతున్న జడ్జి సునీత కుంచాల

నిజామాబాద్‌ సిటీ: చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు కలిసి కట్టుగా కృషి చేస్తే ఏదైనా సాధ్యమని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. హైదరాబాద్‌రోడ్డులో ఉన్న హోటల్‌ కృష్ణలో శనివారం నిర్వహించిన 14వ చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి జడ్జి హాజరై మాట్లాడారు. నిజామాబాద్‌ చాంబర్‌ సభ్యులు బ్రాడ్‌గేజ్‌ రైల్వే రావడానికి చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండి పోతుందన్నారు. జిల్లాలో అన్ని రంగాల వ్యాపారాల అభివృద్ధికి అసోసియేషన్‌ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. వ్యాపారులకు లీగల్‌ పరంగా ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు తాము ఎప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. తెలంగాణ చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ రాష్ట్ర అధ్యక్షుడు జయదేవ్‌ మాట్లాడుతూ.. నూతన కార్యవర్గ సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఆర్‌ జగదీశ్వర్‌ రావు మాట్లాడుతూ.. జిల్లాలో వ్యాపార అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలు రూపొందించి సభ్యులతో కలిసి ముందుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్‌ ఆఫ్‌ తెలంగాణ చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ ఉపాధ్యక్షుడు రవికుమార్‌, నిజామాబాద్‌ చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ ప్రధాన కార్యదర్శి కమల్‌ కిశోర్‌ ఇనానీ, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌, కోశాధికారి హితేష్‌ బిమానీ, సహాయ కార్యదర్శి సూరజ్‌ అగర్వాల్‌, కో–ఆప్షన్‌ సభ్యులు మీసాల సుధాకర్‌రావు, దిలీప్‌ పవార్‌, సలహాదారులు కుమార శర్మ, భక్తవత్సలం, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాటలు కాదు.. చేతల్లో చూపిస్తున్నాం

- బీఆర్‌ఎస్‌ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కోటగిరిలో మాట్లాడుతున్న పోచారం

రుద్రూర్‌: మాటలు చెప్పడం కాదు.. పనులు చేసి చూపిస్తున్నామని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి తనకు ఓటు వేయాలని బీఆర్‌ఎస్‌ బాన్సువాడ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. కోటగిరి మండలంలోని సుద్దులం, సుద్దులం తండా, రాంపూర్‌, కోటగిరి, ఎత్తొండ, యాద్‌గార్‌పూర్‌, దోమలెడ్గి, వల్లాభపూర్‌ గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాయమాటలు చెప్పే వారు వస్తున్నారని వారిని నమ్మొద్దని కోరారు. బీఆర్‌ఎస్‌ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం పలు కుల సంఘాల సభ్యులు ఏకగ్రీవ తీర్మాన ప్రతులను స్పీకర్‌కు అందజేశారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్‌, ఎంపీపీ సునీతాశ్రీనివాస్‌రావు, వైస్‌ ఎంపీపీ గంగాధర్‌ పటేల్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు ఎజాజ్‌ఖాన్‌, రైతు బంధు సమితి మండల కో–ఆర్డినేటర్‌ కిశోర్‌, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పోచారం గెలుపు ఖాయం



ప్రచారం నిర్వహిస్తున్న భాస్కర్‌ రెడ్డి

రుద్రూర్‌: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపు ఖాయమని డీసీసీబీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని సులేమాన్‌నగర్‌లో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా శనివారం ప్రచారం నిర్వహించారు. సొంత నియోజకవర్గాల్లో ప్రజల తిరస్కరణకు గురైన బీజేపీ, కాంగ్రెస్‌ అభ్యర్థులు బాన్సువాడలో ఎలా గెలుస్తారని అన్నారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పత్తి లక్ష్మణ్‌, బాల్‌రాజ్‌, జడ్పీటీసీ నరోజి గంగారాం, సర్పంచ్‌ ఖాదర్‌, విండో మాజీ చైర్మన్‌ పత్తి రాము, అక్కపల్లి నాగేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల గొంతుక బీఎస్‌పీ

రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌

ఎల్లారెడ్డి: పేద ప్రజల గొంతుక బహుజన సమాజ్‌ పార్టీ అని రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. ఎల్లారెడ్డిలోని సీఎస్‌ఐ చర్చిలో బీఎస్‌పీ బహిరంగ సభను శనివారం నిర్వహించారు. సభకు హెలికాప్టర్‌లో వచ్చిన ఆయనకు ఎల్లారెడ్డి బీఎస్‌పీ అభ్యర్థి జమునా రాథోడ్‌ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సభలో ప్రవీణ్‌కుమార్‌ మాట్లాడుతూ.. లింగంపల్లిలో 500 ఎకరాల అసైన్డ్‌ భూముల ఆక్రమణకు మాజీ, ప్రస్తుత ఎమ్మెల్యేలు ప్రయత్నించారని అన్నారు. బీద ప్రజల కోసం పోరాడే పార్టీ బీఎస్‌పీ అని అన్నారు. బీఎస్‌పీ అధికారంలోకి రాగానే భూమి లేని నిరుపేదలకు ఎకరం భూమి మహిళల పేరిట రిజిస్ట్రేషన్‌ చేస్తామన్నారు. బీఎస్‌పీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించా రు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా అ భ్యర్థులు జమునా రాథోడ్‌, ప్రజ్ఞ కుమార్‌, నీరడి ఈ శ్వర్‌, అమర్‌నాథ్‌ బాబు, శేఖర్‌, సురేశ్‌గౌడ్‌, నర్సయ్య, రాజన్న, ఫెరోజ్‌ ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల కేసులపై అవగాహన



ఖలీల్‌వాడి: ఉమ్మడి జిల్లా పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లకు బాలల లైంగిక వేధింపుల చట్టం(ఫోక్సో), మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కేసులపై డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూటర్‌ లక్ష్మీనర్సయ్య శనివారం అవగాహన కల్పించారు. జిల్లా కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లతో సమీక్ష నిర్వహించారు.ఆర్థిక నేరాలు, వైట్‌ కాలర్‌ చట్టంపై బోధన్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ డాక్టర్‌ సమ్మయ్య వివరించారు. సమావేశంలో పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రవిరాజ్‌, అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు బంటు వసంత్‌, నంద రమేశ్‌, జి. శ్యాంరావు, కావేటి శేషు, అందె శ్రీనివాస్‌, నిమ్మ దామోదర్‌ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ కార్యకర్తల మధ్య ఘర్షణ

- ముగ్గురికి కత్తిపోట్లు





గండివేట్‌లో కత్తిపోట్లకు గురైన బాధితులు

గాంధారి (ఎల్లారెడ్డి): మండలంలోని గండివేట్‌లో శనివారం రాత్రి కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ కత్తిపోట్లకు దారి తీసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన హైమద్‌, జావీద్‌, రజాక్‌పై కాంగ్రెస్‌ పార్టీ గ్రామ అధ్యక్షుడు కత్తితో దాడిచేసి గాయపర్చినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన వాట్సాప్‌ గ్రూప్‌లో నుంచి తమను ఎందుకు తొలగించారని ప్రశ్నించినందుకు కాంగ్రెస్‌ పార్టీ గ్రామ అధ్యక్షుడు కత్తితో దాడి చేసినట్లు తెలిపారు. కత్తిపోట్లకు గురైన బాధితులను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. అందులో హైమద్‌ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్‌ జిల్లాస్పత్రికి తరలించారు. బాధితుల వెంట ఎమ్మెల్యే జాజాల నిజామాబాద్‌కు వెళ్లారు. దాడి విషయమై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు సర్పంచ్‌ ఫారూఖ్‌ తెలిపారు. ఈ ఘటనపై ఎస్సై ప్రేమ్‌దీప్‌ను సంప్రదించగా గండివేట్‌లో కత్తిపోట్లు జరిగాయని, భీందాస్‌ అనే వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు ఫిర్యాదు చేశారని విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆల్‌ ది బెస్ట్‌ ఇండియా..



- నేడు ఇండియా – ఆస్ట్రేలియా వరల్డ్‌కప్‌ ఫైనల్‌ మ్యాచ్‌
- మూడోసారి కప్‌ సాధించాలని అభిమానుల ఆకాంక్ష

నిజామాబాద్‌నాగారం: వరల్డ్‌ కప్‌ మ్యాచ్‌లో ప్రత్యర్థ జట్లను ఓడిస్తూ ఫైనల్‌కు చేరిన ఇండియా జట్టు ఆస్ట్రేలియాతో ఆదివారం మధ్యాహ్నం తలపడనుంది. కెప్టెన్‌ రోహిత్‌ సారథ్యంలో వరుస విజయాలతో దూసుకెళ్తున్న భారత్‌ జట్టు ఫైనల్‌లోనూ విజయం సాధించాలని యావత్‌ భారత్‌ కోరుకుంటోంది. భారత్‌ జట్టు ఫైనల్‌కు చేరడంతో మూడో సారి వరల్డ్‌ కప్‌ను సాధించాలని ఆకాంక్షిస్తూ జిల్లా క్రీడాభిమానులు తమ ఆనందాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

రోహిత్‌సేనతో విజయం సాధ్యం



కెప్టెన్‌ రోహిత్‌సేనతో ఆదివారం నిర్వహించే మ్యాచ్‌లో తప్పకుండా ఇండియా విజయం సాధిస్తుంది. ఇప్పటికే కోహ్లీ, మహమ్మద్‌ షమీ రికార్డులు సష్టించారు. నేటి మ్యాచ్‌కు క్రీడాకారులందరం ఎదురుచూస్తున్నాం.

– సయ్యద్‌ ఖైసర్‌, అథ్లెటిక్స్‌ గోల్డ్‌ మెడలిస్ట్‌

విజేతగా మన జట్టే..



వరుస విజయాలతో మన జట్టు దూసుకెళ్తుంది. బౌలింగ్‌, బ్యాటింగ్‌తో సమ ఉజ్జితో రాణిస్తోంది. ఇదే స్ఫూర్తితో ఫైనల్‌లో భారత జట్టు విజేతగా నిలవనుంది. ముందస్తుగా భారత జట్టుకు శుభాకాంక్షలు.

–ఫారస్‌, క్రికెట్‌ కోచ్‌

ఉత్కంఠ భరితంగా..



భారత్‌–ఆస్ట్రేలియా మధ్య వరల్డ్‌ కప్‌ ఉత్కంఠ భరితంగా సాగనుంది. ఈ మ్యాచ్‌ కోసం కోసం రెండు రోజులుగా ఎదురు చూస్తున్నాం. క్రికెట్‌ అభిమానులు పలు చోట్ల పెద్ద పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

–నిఖత్‌జరీన్‌, బాక్సింగ్‌ క్రీడాకారిణి

2011 రిపీట్‌..



2011 వరల్డ్‌ కప్‌ ట్రోఫీ ఆదివారం రిపీట్‌ కానుంది. మన భారత క్రికెట్‌ జట్టును చూస్తుంటే గర్వంగా ఉంది. అందరూ చక్కని ప్రతిభ కనబరుస్తున్నారు. క్రీడాకారులు అత్యధిక వికెట్లు పడగొట్టడం శుభ పరిణామం. కచ్చితంగా ట్రోఫీ సాధించడం ఖాయం.

–సౌమ్య, ఫుట్‌బాల్‌ క్రీడాకారిణి

మూడోసారి కప్‌ గెలవాలి



దేశంలో ఏ క్రీడకు లేని విధంగా క్రికెట్‌కు పెద్ద ఎత్తున అభిమానులు ఉంటారు. ప్రస్తుతం మన భారత జట్టు ఎనలేని ఉత్సాహంతో ముందుకెళ్తోంది. ఇప్పటికే అన్ని రికార్డులను సొంతం చేసుకున్న జట్టు మూడోసారి వరల్డ్‌ కప్‌సాధించాలని కోరుకుంటున్నా.

–శైలవర్ధన్‌, సీనియర్‌ క్రికెట్‌ కోచ్‌

ఇండియాపై అభిమానంతో..



ఆర్మూర్‌ ప్రకాశ్‌ రూపొందించిన నమూనా వరల్డ్‌ కప్‌



మారుతి రూపొందించిన నమూనా వరల్డ్‌ కప్‌

ఇండియా, ఆస్ట్రేలియా మధ్య వన్డే ప్రపంచ కప్‌ ఆదివారం జరగనుంది. ఈ మ్యాచ్‌లో ఇండియా కప్‌ గెలవాలని ఆకాంక్షిస్తూ.. పలువురు క్రీడాభిమానులు తమదైన శైలిలో అభిమానం చాటుతున్నారు. ఆర్మూర్‌ పట్టణానికి చెందిన స్వర్ణకారుడు ఎస్‌. ప్రకాశ్‌ 0.020 మిల్లీ గ్రాముల బంగారం, ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌కు చెందిన స్వర్ణకారుడు శ్రీరామోజి మారుతి 50 మిల్లీ గ్రాముల బంగారంతో వరల్డ్‌ కప్‌ నమూనాలను తయారు చేశారు. ఇది చూసిన స్థానికులు వారిని అభినందించారు.

–ఆర్మూర్‌టౌన్‌/ మోర్తాడ్‌

క్రైం కార్నర్‌

నీటమునిగి అన్నాతమ్ముళ్ల మృతి



హరియా, బాల్‌సింగ్‌ మృతదేహాలు

రాజంపేట: ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నాతమ్ముళ్లు నీటమునిగి మృతిచెందిన ఘటన మండలంలోని కొండాపూర్‌ పరిధిలోని ఇనాం తండాలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లచ్యా నాయక్‌ ఇటీవల మృతి చెందాడు. అస్థికలను మెదక్‌ జిల్లా హవేలి ఘన్‌పూర్‌ మండలంలోని పోచారం డ్యాంలో కలిపేందుకు లచ్యా కుటుంబ సభ్యులతో పాటు తమ్ముడు కిషన్‌ కుమారులు చవాన్‌ హరియా(45), చవాన్‌ బాల్‌సింగ్‌(42) వెళ్లారు. మొదట చవాన్‌ హరియా బండపై నిలబడి అస్థికలను నీటిలో వదిలే క్రమంలో కాలు జారి నీట మునిగాడు. ఇది గమనించిన సోదరుడు చవాన్‌హరియా కాపాడే క్రమంలో హరియా సైతం నీట మునిగి మృతిచెందాడు. ఒకే కుటుంబానికి చెందిన అన్నాతమ్ముళ్లు ఒకే సారి మృతిచెందడంతో తండాలో విషాదచాయలు అలుముకున్నాయి.

గంజాయి పట్టివేత



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌ చౌరస్తాలో గంజాయి విక్రయిస్తున్న అంజద్‌ అనే వ్యక్తిని పట్టుకున్నట్లు ఎక్సైజ్‌ సీఐ స్టీవెన్సన్‌ శనివారం తెలిపారు. పెర్కిట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అంజద్‌ను పట్టుకొని తనిఖీ చేయగా 300గ్రాముల గంజాయి లభ్యమైనట్లు పేర్కొన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని అంజద్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు చెప్పారు. తనిఖీలో ఎక్సైజ్‌ ఎస్సై గంగాధర్‌, చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఏఎస్సై..



లలిత (ఫైల్‌)

మాచారెడ్డి: మండల కేంద్రంలోని పీఎస్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వాసి లలిత(54) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఎస్సై శ్రీనివాస్‌ గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన లలితను హైదరాబాద్‌కు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన అంత్యక్రియలకు ఎస్సైతో పాటు సిబ్బంది హాజరై నివాళి అర్పించారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

ఖలీల్‌వాడి: నగరంలోని న్యాల్‌కల్‌ రోడ్‌లో ఉన్న ఉన్న యూనియన్‌బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా ఏటీఎంలో దుండగులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడినట్లు ఎస్సై సంజీవ్‌ శనివారం తెలిపారు. దుండగులు రెండు ఏటీఏంలను ధ్వంసం చేయగా పాక్షికంగా ధ్వంసమయ్యాయని డమ్ము మాత్రం పోలేదని పేర్కొన్నారు. బ్యాంక్‌ డిప్యూటీ మేనేజర్‌ ప్రమోద్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.